అక్కచెల్లెమ్మల భద్రతకు 'ఆసరా'



- సీఎం చల్లని చూపు తమపై పడిందని 35వ వార్డు మహిళల సంతోషం
- చిరు వ్యాపారాలతో కుటుంబాలకు అండ

పేదల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం 'ఆసరా'తో నిరుపేద మహిళల జీవితాలకు భద్రత కల్పిస్తోంది. దీంతో చిన్నచిన్న వ్యాపారాలు చేసుకుంటూ వారు తమ కుటుంబాలకు వెన్నుదన్నుగా నిలుస్తున్నారు. గతంలో ఏ ప్రభుత్వాలు తమ కోసం ఆలోచించలేదని.. జగనన్న ముఖ్యమంత్రి అయ్యాక తమ బాగు కోరే వారు కూడా ఉన్నారనే ధీమా దొరికిందని వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


ఆసరా చేయూతతో కూరగాయల వ్యాపారం నిర్వహణ

జగదాంబ : సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పేదలు, మధ్య తరగతి ప్రజలకు అభివృద్ధి, సంక్షేమ పాలన అందిస్తున్నారు. ముఖ్యంగా మహిళల సాధికారత కోసం అనేక పథకాలు, కార్యక్రమాలు అమలు చేస్తున్నారు. అందులో భాగంగా అందజేస్తున్న 'ఆసరా' పథకం మహిళలకు చక్కటి ఉపాధినందిస్తోంది. రుణమాఫీ పొందిన మహిళలు ఇంటి వద్దే చిరు వ్యాపారాలు చేసుకుంటూ కుటుంబాలకు దన్నుగా నిలుస్తున్నారు. జీవీఎంసీ 35వ వార్డులోని అయిదు సచివాలయాల్లో వంద మందికి పైగా 'ఆసరా'చేయూతతో చిరు వ్యాపారాలు చేసుకుంటున్నారు.

ఆడపడుచుల బతుకుల్లో వెలుగులు..

గత ప్రభుత్వ హయాంలో పింఛన్లు నెలలో ఎప్పుడు ఇస్తారో తెలియని పరిస్థితి ఉండేది. రుణ మాఫీ కూడా అంతంత మాత్రమే. పేదలు ఎలాంటి ఆధారం లేక అప్పుల పాలయ్యేవారు. దీంతో ఎంతో మంది మహిళలు ఇల్లు, పిల్లల్ని వదిలి కూలి పని చేసుకునే దుస్థితి ఉండేది. ఈ నేపథ్యంలో జగనన్న ప్రభుత్వం ప్రతి పేదవాడి బతుకులో వెలుగులు నింపింది. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు నాలుగు సంవత్సరాలుగా దశల వారీగా రుణమాఫీ చేసి ఆడపడుచుల బతుకుల్లో వెలుగులు నింపింది.

నియోజకవర్గంలో 2023-24 సంవత్సరానికి 'ఆసరా' లబ్ధిదారుల వివరాలు

వార్డు	లబ్ధిదారులు	నగదు మొత్తం
28	2256	38562260
29	1819	39722738
30	1715	32091410
31	1469	29258404
32	1768	31396277
33	1474	29020352
34	1891	36328379
35	2650	38457874
36	1881	42416176
37	2656	45935510
38	2478	55129626
39	1261	27500445

మొత్తం లబ్ధిదారుల సంఖ్య 23218 మంది
'ఆసరా' ద్వారా పొందిన నగదు
మొత్తం : రూ. 44,58,19,451


ఆసరా డబ్బుతో వ్యాపారం చేసుకుంటున్న మహిళ

జీవితాలు బాగుపడ్డాయి..



జగనన్న 'ఆసరా'తో నేను బేంబూ (వెదురు)తో చిన్న పాటి వ్యాపారం చేసుకుంటున్నాను. గతంలో ఇంటాయన తేవాలి.. ఇంటిల్లిపాదీ తినాలి అన్నట్టు ఉండేది. ఇప్పుడు మేం కూడా తోచిన వ్యాపారం చేసుకుని వచ్చిన దాంతో కుటుంబమంతా హాయిగా ఉన్నాం. జగనన్న వల్ల మాలజీవితాలు బాగుపడ్డాయి.
– రాజేశ్వరి, బేంబూ వ్యాపారి, పూర్ణామార్కెట్

జగనన్న 'ఆసరా' ఆదుకుంది..



ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న మమ్మల్ని జగనన్న 'ఆసరా' ఆదుకుంది. వడ్డీలకు డబ్బు తీసుకుని వ్యాపారం చేసుకునే రోజులు పోయాయి. జగనన్న ఇస్తున్న 'ఆసరా'సొమ్ముతో నా భార్య కూరగాయల వ్యాపారం నడుపుతోంది. దీంతో మా కుటుంబం ఆర్థిక ఇబ్బందులు లేకుండా జీవిస్తోంది.
– కృష్ణారెడ్డి, పూర్ణామార్కెట్

అర్హులందరికీ సంక్షేమం



ప్రభుత్వం అందజేస్తున్న ప్రతి సంక్షేమ ఫలం అర్హులకు అందేలా కృషి చేస్తున్నాం. ఇప్పటికీ అర్హులై ఉండీ ఏదైనా ప్రభుత్వ పథకం రాకపోతే వెంటనే తెలియజేస్తే వారి ఇంటికి సెక్రటరీ వచ్చి పథకం అందేలా చర్యలు తీసుకుంటారు. సీఎం జగన్ రాష్ట్రంలో అందరినీ సమానంగా చూస్తున్నారు. అందరికీ సంక్షేమం అందజేస్తున్నారు.
– వాసుపల్లి గణేష్‌కుమార్, ఎమ్మెల్యే

క్లుప్తంగా

ఆటో డ్రైవర్‌కు ఆర్థిక సాయం


రమేష్‌ను పరామర్శిస్తున్న నవీన్‌కుమార్

దాబాగార్డెన్స్ : గత కొంత కాలంగా అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆటో డ్రైవర్‌కు ఆ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకుడు బత్తిన నవీన్‌కుమార్ ఆదివారం ఆర్థిక సాయం అందజేశారు. 31వ వార్డు ఓంకార శివాలయం వీధికి చెందిన పెదిరెడ్ల రమేష్ ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కొంత కాలంగా గుండెకు సంబంధించిన వ్యాధితో బాధపడుతూ నగరంలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న నవీన్ ఆస్పత్రికి వెళ్లి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో నక్కా వేణు, అజ్జి రాజేష్, శంకరరావు, జితేంద్ర, మణికంఠ పాల్గొన్నారు.

జీవీఎంసీ దఫేదార్ల ఆత్మీయ సమ్మేళనం


ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న దఫేదార్లు

ఆరిలోవ: జీవీఎంసీ దఫేదార్ల అసోసియేషన్ ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ముడసర్లోవ పార్కులో ఘనంగా జరిగింది. సుమారు 150 మంది దఫేదార్లు పాల్గొని ఉత్సాహంగా గడిపారు. ముఖ్యఅతిథిగా డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, అతిథులుగా పలువురు జీవీఎంసీ అధికారులు పాల్గొని దఫేదార్లతో సరదాగా గడిపారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ నారాయణ్, గణపతి, నరేష్, సింహాచలం, అప్పారావు, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా వైశాఖి దివ్యాంగ విద్యార్థి ట్రస్ట్ వార్షికోత్సవం

ఎంవీపీ కాలనీ: వైశాఖి దివ్యాంగ విద్యార్థి సేవా చారిటబుల్ ట్రస్ట్ 15వ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. వెంకోజీపాలెంలోని సీఎంఆర్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన వేడుకలో సీఎంఆర్ అధినేత మావూరి వెంకటరమణ మాట్లాడుతూ దివ్యాంగులకు ట్రస్ట్ అందిస్తున్న సేవలను కొనియాడారు. సమాజంలో ఇబ్బందులకు గురవుతున్న దివ్యాంగులకు ఆశ్రయం ఇచ్చి ఆదరిస్తున్న ఎన్‌జీవోలకు సహకారం అందించేందుకు ఈ సంస్థ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ప్రభుత్వ ఉద్యోగాల నుంచి పదవీ విరమణ చేసిన వారంతా కలిసి ఈ ట్రస్ట్‌ను నిర్వహిస్తున్నట్టు అధ్యక్షుడు శ్రీమన్నారాయణ తెలిపారు. ప్రతి నెలా ఒక దివ్యాంగుల ఆశ్రమాన్ని ఎంపిక చేసుకుని మంచి భోజనం, పోషకాహారం అందించడంతో పాటు అక్కడి వారికి అవసరమైన నిత్యావసరాలు, పరికరాలు, పుస్తకాలు, దుస్తులు ఇలా అన్ని సమకూర్చుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధి లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సేవ.. యువత బాధ్యత

మురళీనగర్: యువత సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొనడానికి ముందుకు రావాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి, యలమంచిలి నియోజకవర్గ ఇన్‌చార్జి రొంగలి జగన్నాథం పిలుపునిచ్చారు. మురళీనగర్ ప్రశాంతి ఆధ్యాత్మిక పార్కులో పార్కు నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో యువజన దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించి ప్రసంగించారు. భారతీయత గొప్పదనాన్ని, దేశ సంస్కృతీ సంప్రదాయాలను ప్రపంచానికి చాటి చెప్పిన వివేకానందుడిని స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. ముందుగా ఆయన వివేకానందుడి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ శిబిరంలో యువకులు, స్థానికులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో పార్కు కార్యదర్శి పృథ్వీ, జీవీ రత్నం, భాస్కర్, మోహన్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఘనంగా బల్లల పండగ


బాపూ ఆనంద్‌ను సత్కరిస్తున్న కనకలవీధి, ఎల్లమ్మతోట దోబీ సంఘం సభ్యులు

దాబాగార్డెన్స్ : రజకుల వేడుక బల్లల పండగ ఆదివారం ఘనంగా నిర్వహించారు. కనకలవీధి, ఎల్లమ్మతోటలో నిర్వహించిన పండగలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు దొడ్డి బాపూ ఆనంద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం బాపూ ఆనంద్‌ను ఎల్లమ్మతో దోబీ సంక్షేమ సంఘం సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో కనకలవీధి దోబీ సంఘం అధ్యక్షుడు రాము మాస్టారు, ఎల్లమ్మతోట దోబీ సంఘం అధ్యక్షుడు కనకరాజు, రాంబాబు, మహేష్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

'వేటూరి' సంగీత విభావరి రేపు

సీతంపేట: సినీ గేయ రచయిత వేటూరి సుందరరామ్మూర్తి 88వ జయంతి సందర్భంగా ఆత్రేయ స్మారక కళాపీఠం ఆధ్వర్యంలో ఈ నెల 30వ తేదీ మంగళవారం సాయంత్రం 6 గంటలకు దాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రం ఆడిటోరియంలో వేటూరి రచించిన చిత్ర గీతాలతో సినీ సంగీత విభావరి నిర్వహించనున్నట్టు కళా పీఠం కార్యదర్శి గంటి మురళి తెలిపారు. ఈ సందర్భంగా సినీ నేపథ్య గాయని గాలిదేవర సాహితిని వేటూరి యువ గాయని పురస్కారంతో సత్కరిస్తున్నట్టు చెప్పారు. సినీ గాయని సాహితి, రమేష్ పట్నాయక్, శంబర జోగారావు, బాల గణేష్, హారిక, పట్నాయక్, లిపికారెడ్డి తదితరులు వేటూరి గీతాలను ఆలపిస్తారన్నారు. కార్యక్రమంలో కళాకారులు, కళాభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని సంగీత విభావరిని జయప్రదం చేయాలని నిర్వాహకులు కోరారు.

ఏపీ ప్రొఫెషనల్ బాక్సింగ్ కౌన్సిల్ అధ్యక్షుడిగా 'యల్లపు'


యల్లపు రఘురామ్‌ను అభినందిస్తున్న కౌన్సిల్ ప్రతినిధులు

దాబాగార్డెన్స్ : ఆంధ్రప్రదేశ్ ప్రొఫెషనల్ బాక్సింగ్ కౌన్సిల్ అధ్యక్షుడిగా యల్లపు రఘురామ్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆదివారం నగరంలోని ఓ హోటల్లో నిర్వహించిన కార్యక్రమంలో ఇండియన్ బాక్సింగ్ కౌన్సిల్ అధ్యక్షుడు మురళీధరణ్‌రాజా ఆదేశాల మేరకు తెలంగాణ రాష్ట్ర ప్రొఫెషనల్ బాక్సింగ్ కౌన్సిల్ ప్రధాన కార్యదర్శి మణిందర్‌సింగ్ పాల్గొని యల్లపు రఘురామ్‌ను నియమించారు. అలాగే ప్రధాన కార్యదర్శిగా వాసుపల్లి అమ్మోరుతో పాటు కార్యవర్గ సభ్యులను నియమించారు. ఈ సందర్భంగా మణిందర్‌సింగ్ మాట్లాడుతూ ప్రొఫెషనల్ బాక్సింగ్ టోర్నమెంట్ నిర్వహించుకునేందుకు లైసెన్స్ జారీ చేసినట్టు చెప్పారు. ఈ సందర్భంగా ఇప్పటికే రెండు సార్లు ప్రొఫెషనల్ బాక్సింగ్ బౌట్స్‌లో పాల్గొని ర్యాంకింగ్ సాధించిన బాక్సర్లు కె. శ్రీను, భవానీప్రసాద్, గణేష్‌ను అభినందించారు. యల్లపు రఘురామ్ మాట్లాడుతూ క్లబ్ కోచ్‌లు, బాక్సర్ల సహకారంతో ప్రొఫెషనల్ క్రీడను ముందుకు తీసుకెళ్తామని చెప్పారు. కార్యక్రమంలో ప్రవీణ్‌కుమార్, గొర్రెల చందు, డాక్టర్ బి. సునిల్, రూబెన్, యల్లపు పృథ్వీ, పలువురు కోచ్‌లు, బాక్సర్లు పాల్గొన్నారు.

స్క్రాప్ వాహనాలకు నిప్పు

- మందుబాబుల పనే అంటున్న క్రీడాకారులు


మంటల్లో కాలిపోయిన వాహనాలు

జగదాంబ : ఆకతాయిల చేష్టల కారణంగా రెండు స్క్రాప్ వాహనాలు మంటల్లో కాలిపోయాయి. జీవీఎంసీ 35వ వార్డు ఇందిర ప్రియదర్శిని మున్సిపల్ స్టేడియంలో జీవీఎంసీకి చెందిన స్క్రాప్ వాహనాలు పెడుతూ ఉంటారు. అయితే కొందరు వ్యక్తులు స్టేడియం లోపలికి వచ్చి మద్యం సేవించడం, గంజాయి తాగడం వంటి పనులు చేస్తు బీభత్సం సృష్టిస్తుంటారు. అలాగే ఆదివారం కూడా కొందరు గుర్తు తెలియని వ్యక్తులు మద్యం, గంజాయి సేవించి స్టేడియంలో ఉన్న రెండు స్క్రాప్ వాహనాలకు నిప్పు పెట్టి వెళ్లిపోయారు. మంటలు వ్యాపించడం చూసిన సమీపంలోని వ్యక్తులు అగ్నిమాపక కేంద్రం అధికారులకు ఫోన్ చేయడంతో వారు వచ్చి మంటలార్పి పరిస్థితి అదుపులోకి తీసుకువచ్చారు. అప్పటికే ఒక వాహనం పూర్తిగా మంటల్లో కాలి బూడిదైపోగా, రెండవది సగం వరకు కాలిపోయింది. జీవీఎంసీ అధికారులు సెక్యూరిటీ ఏర్పాటు చేయకపోవడం వల్లే ఆకతాయిలు ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడుతున్నట్లు స్థానికులు, క్రీడాకారులు చెబుతున్నారు.

అంతర్జాతీయ న్యాయస్థానం తీర్పును అమలు చేయాలి


జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న భారత నాస్తిక సమాజం ప్రతినిధులు

సీతమ్మధార : ఇజ్రాయిల్–పాలస్తీనా అంతర్జాతీయ న్యాయస్థానం తీర్పును పాటించాలని భారత నాస్తిక సమాజం ప్రతినిధులు కోరారు. ఆదివారం భారత నాస్తిక సమాజం ఆధ్వర్యంలో జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ప్రతినిధులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కన్వీనర్ టి.శ్రీరామ్మూర్తి మాట్లాడుతూ అంతర్జాతీయ న్యాయస్థానం ఇచ్చిన తీర్పును ఇజ్రాయెల్ పాటించాలని, మూడు నెలలుగా జరుపుతున్న మారణహోమం ఆపాలన్నారు. బడి పిల్లలపై, ఆస్పత్రుల మీద, బజార్లలోని జనసమూహాలపై దాడులు చేయడం ద్వారా వందలాది మంది మరణించారన్నారు. ఇజ్రాయెల్ వెంటనే కాల్పుల విరమణ పాటించాలని, శాంతి చర్చలు కొనసాగించాలన్నారు. రాష్ట్ర కమిటీ సభ్యులు శ్యామల మాట్లాడుతూ ఇరాన్‌లో ఆడవాళ్లపై జరుగుతున్న మారణకాండకి వ్యతిరేకంగా నిరసన తెలుపుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర కమిటీ కన్వీనర్ మురళి, చార్వక, రషీద్, కర్రి మల్లేశం, రెండు తెలుగు రాష్ట్రాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మట్టితో నిండిపోయిన స్టేడియం


మున్సిపల్ స్టేడియంలో పేరుకుపోయిన మట్టి

జగదాంబ : ఇందిర మున్సిపల్ స్టేడియం మట్టితో నిండిపోయింది. జీవీఎంసీ జోన్–4 పరిధిలో రహదారి విస్తరణ జరుగుతున్న విషయం తెలిసిందే. ఇందులో రూ. ఎనిమిది కోట్లకు కాంట్రాక్టర్లు కాలువల నిర్మాణానికి టెండర్లు దక్కించుకున్నారు. అయితే రహదారి విస్తరణ పనులు, పక్క కాలువలకు సంబంధించిన మట్టిని కాంట్రాక్టర్లు దూరంగా వేయాల్సి ఉంది. కానీ సమీపంలో ఉన్న ఇందిర మున్సిపల్ స్టేడియంను ఉపయోగించుకుని టన్నులు కొద్దీ డెబ్రిస్ (మట్టి)ని వేసి స్టేడియం అంతా నింపేశారు. కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని క్రీడాకారులు ఆరోపిస్తున్నారు. అసలే స్టేడియం అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో ఇలా అపరిశుభ్రం చేయడంతో వాకర్లు, క్రీడాకారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. స్టేడియంలో మట్టి కుప్పలుగా ఉండిపోవడంతో విష కీటకాలు చేరుతాయని భయపడుతున్నారు. ఇప్పటికైనా జీవీఎంసీ అధికారులు స్పందించి మట్టిని తొలగించి స్టేడియంను పరిశుభ్రంగా ఉంచాలని క్రీడాకారులు కోరుతున్నారు.

జాతీయ స్థాయిలో సత్తా చాటాలి


మాస్టర్ అథ్లెట్స్‌కు ట్రాక్ సూట్‌లు అందిస్తున్న సనపల వరప్రసాద్

మురళీనగర్: విశాఖ మాస్టర్స్ అథ్లెట్లు జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో సత్తా చాటి బంగారు పతకాలు సాధించాలని మురళీనగర్ వైశాఖి స్పోర్ట్స్ పార్కు అధ్యక్షుడు సనపల వరప్రసాద్ ఆకాంక్షించారు. ఇండియన్ మాస్టర్స్ అథ్లెటిక్స్ కార్యదర్శి మంగ వరప్రసాద్ ఆధ్వర్యంలో ఆదివారం వైశాఖి స్పోర్ట్స్ పార్కులో రాష్ట్ర స్థాయిలో పతకాలు సాధించిన మాస్టర్స్ అథ్లెటిక్స్ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులకు తమ వంతు పూర్తి సహకారం అందిస్తామని చెప్పారు. ఈ సందర్భంగా క్రీడాకారులకు ట్రాక్ సూట్‌లను వరప్రసాద్ అందించారు. క్రీడాకారులను ప్రోత్సహిస్తూ విజన్ డెవలపర్స్ అధినేత ఎం.శ్రీరామమూర్తి 50 మందికి క్యాప్‌లు అందజేశారు. కార్యక్రమంలో వెటరన్ అథ్లెటిక్స్ అసోసియేషన్ విశాఖ జిల్లా కార్యదర్శి ఎల్‌వీ సుధాకర్, కోశాధికారి ఎం.రామారావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ వీరభద్రరావు, ఎం.శ్రీనివాస్ రాజు, పోలీస్ శాఖ నుంచి క్రీడాకారులు జె.ఉష, బాలరాజు, అనురాధ, డాక్టర్ భాగ్యలక్ష్మి, సరోజిని, బాలరాజు, వనిత వాకర్స్ క్లబ్ కార్యదర్శి జయ, వాకర్స్ హెల్త్ క్లబ్ అధ్యక్షుడు శ్రీనివాస రాజు, యూనివర్సల్ యూత్ అధ్యక్షుడు వంశీ, శశికుమార్, రాజ్యలక్ష్మి ఇతర క్రీడాకారులు పాల్గొన్నారు.

'రాజ్యసభ సభ్యత్వానికి జీవీఎల్ రాజీనామా చేయాలి'


జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

సీతమ్మధార : బీజేపీ రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ తన రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేయాలని, కేంద్ర ప్రభుత్వం మీద ఒత్తిడి తెచ్చి స్టీల్‌ప్లాంట్ ప్రభుత్వ రంగంలోనే కొనసాగుతుందని ప్రకటన చేయాలని కాంగ్రెస్ నాయకులు ప్రియంకా దండి తెలిపారు. ఈ మేరకు జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ప్లకార్డులతో నిరసన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 1080 రోజుల నుంచి కార్మికులు పోరాటం చేస్తున్నా కేంద్రానికి చీమ కుట్టినట్లు అయినా లేదని మండిపడ్డారు. స్టీల్‌ప్లాంట్‌పై జీవీఎల్ స్పందించకపోతే ఆయన ఇంటిని ముట్టడిస్తామని, స్టీల్‌ప్లాంట్‌ని కాపాడుకుంటామని అన్నారు. అయోధ్య రామ మందిర నిర్మాణాన్ని స్వాగతిస్తున్నామని, అన్నం పెట్టే ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేయటాన్ని సహించబోమన్నారు. ఈ కార్యక్రమంలో కొయ్య రామకృష్ణ యాదవ్, దార్ల శ్రీను, జగన్ మురారి, శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యతో పాటు మానవీయ విలువలు అవసరం


ప్రత్యేక సంచికను ఆవిష్కరిస్తున్న శ్రీ సత్యసాయి విద్యావిహార్ ప్రతినిధులు

ఎంవీపీ కాలనీ: శ్రీసత్యసాయి విద్యావిహార్ 38వ వార్షికోత్సవం ఆదివారం ఎంవీపీ కాలనీలోని పాఠశాల ఆవరణలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా మాజీ ఐఏఎస్ బసంత్‌కుమార్ ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ విద్యా విహార్ విద్యార్థుల సేవా దృక్పథం వెలకట్టలేనిదన్నారు. చదువుతో పాటు విద్యార్థులకు సామాజిక స్పృహ, సేవా నిరతిని అందిస్తున్న శ్రీసత్యసాయి విద్యా సంస్థ కృషి అభినందనీయమన్నారు. నేటి సమాజంలో విద్యతో పాటు మానవీయ విలువలు అత్యంత అవసరమన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అనంతరం స్కూల్ ప్లాస్ ప్రత్యేక సంచికను అతిథులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ కౌసల్య, సత్యసాయి విద్యా విహార్ విద్యార్థిని, గాయని శిరీషాతో పాటు పలువురు సత్యసాయి సేవా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన


వైద్య పరీక్షలు చేస్తున్న నిపుణులు

మురళీనగర్: స్థానిక వాకర్స్ పార్కులో వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో క్వీన్స్ ఎన్ఆర్ఐ ఆస్పత్రి సహకారంతో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. 194 మందికి బీపీ, సుగర్ పరీక్షలు, 136 మందికి ఈసీజీలు, 108 మందికి కంటి వైద్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ఎముకలు, కీళ్ల వ్యాధి నిపుణుడు డాక్టర్ ఎం.రామరాజు మాట్లాడుతూ వృద్ధులు ఎముకల సాంద్రత పరీక్షలు చేయించుకుని వైద్యుని సలహాల మేరకు క్రమం తప్పకుండా మందులు వాడాలన్నారు. డాక్టర్ రేవతి మాట్లాడుతూ ఆహారంలో పిండి పదార్థాలు తగ్గించి ప్రొటీన్, ఫైబర్ ఎక్కువగా ఉండే వాటిని తీసుకోవాలని సూచించారు. నేత్ర వైద్య నిపుణులు డాక్టర్ యలమంచిలి శ్రీవాణి కంటికి సంబంధించిన సమస్యలు, వాటి పరిష్కార మార్గాలను వివరించారు. క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి పర్యవేక్షణలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వైద్యులను సత్కరించారు. క్లబ్ పూర్వాధ్యక్షుడు సత్తి సునీల్‌రెడ్డి సమరిృంచిన సరియైన ఉచ్చారణ, అడవితల్లి ఒడి అనే పుస్తకాలను వైద్యులకు అందించారు. డిస్ట్రిక్ట్–101 ఎలెక్ట్ గవర్నర్ కె.ద్వారకానాథ్, పూర్వాధ్యక్షుడు ఎస్.బుచ్చయ్య, వాకర్స్ ఇంటర్నేషనల్ అదనపు కార్యదర్శి ఆర్.సత్యనాథం, కోశాధికారి జె.కూర్మారావు, జాలీ వాకర్ ఎ.ప్రకాశరావు, సంయుక్త కార్యదర్శి చొల్లంగి ప్రసాదరావు, కార్యవర్గ సభ్యులు వడ్డాది అప్పారావు, ఎస్.శ్రీనివాసరావు, ఆర్.నాగేశ్వరరావు, టి.వెంకటరమణ, ఎస్.రామ్మోహనరావు, కోన ప్రసాద్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

సెయింటాన్స్‌లో ఉత్సాహంగా యూత్ ఫెస్టివల్


యూత్ ఫెస్టివల్‌లో పాల్గొన్న నిర్వాహకులు, విద్యార్థులు

ఆరిలోవ: ఆరిలోవలోని సెయింటాన్స్ పాఠశాలలో ఆదివారం యూత్ ఫెస్టివల్ ఉత్సాహంగా సాగింది. ఈ వేడుకల్లో అధిక సంఖ్యలో విద్యార్థినులు నృత్యాలు, పాటలతో సందడి చేశారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా స్కిల్ డెవెలప్‌మెంట్ సెంటర్ చీఫ్ జనరల్ మేనేజర్ ఇమిత్రియాజ్ అర్షద్ మాట్లాడుతూ దేశ నిర్మాణానికి యువత మూల స్తంభమన్నారు. క్రమ శిక్షణతో కూడిన యువత దేశానికి అవసరమన్నారు. యువత ప్రతి పనిలోను నైపుణ్యం పెంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రొవెన్సియల్ మేరీ ఏంజిల్, కౌన్సిల్ ఇన్‌చార్జి అనిత, యూత్ కోఆర్డినేటర్ సుజాత, ఆరిలోవ, మల్కాపురం, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, ఏలూరు, విజయనగరం, రాజాం, శ్రీకాకుళం ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులు పాల్గొన్నారు.